# పెద్దలను గౌరవించండి, వారందించే ఆదర్శాలను అనుసరించండి

*ప్రేమస్వరూపులారా!* ఈనాడు భీమ రథ శాంతి మహోత్సవములో పాల్గొన్న వృద్ధ కల్యాణ దంపతులు ఎంతగానో ఆనందించారు. దీనికి 'భీమ రథ శాంతి' అని పేరు పెట్టడంలో గల అంతరార్థమును మీరు గుర్తించాలి. 'భీమ రథ శాంతి' అనగా, భీమునివలె బలవంతులుగను, పుష్టివంతులుగను ఉండమని కాదు. భీముడు వాయుపుత్రుడు. వాయుశక్తి అపరిమితమైనది. అది ఎక్కడికైననూ వెళ్ళగలదు. ఏ పనైననూ చేయగలదు. అన్ని విధాలుగా దిగ్విజయాన్ని సాధించగలదు.

ఈ భీమ రథ శాంతికి కొన్ని నిబంధనలు ఉంటున్నాయి. అయితే, దీనికి వయోపరిమితి లేదు. భర్తకు 60 సంవత్సరాలు పూర్తయినప్పుడు శాంతిని కోరుకుంటూ దంపతులు షష్టిపూర్తి పండుగను జరుపుకుంటారు. 70వ సంవత్సరం దాటిన తరువాత 'డైమండ్ జూబ్లీ' ఉత్సవం జరుపుకుంటారు. 70 తరువాత 80, 90, 100 సం॥లకు జరుపుకునే ఉత్సవానికి 'భీమ రథ శాంతి' అని పేరు పెట్టారు.

ఈనాటి పిల్లలు 60 సం॥లు దాటిన తరువాత తమ తల్లిదండ్రులను బయటికి పంపుతారు. 'వారు ఈ సంసార సంబంధమైన బంధనలో ఉండకూడదు; కేవలం సన్యాసాశ్రమంలో చేరి ఉండాల'ని భావిస్తారు. అది చాలా పొరపాటు. 60 సం॥లు దాటిన తరువాత తల్లిదండ్రుల పరిస్థితిని గుర్తించి, వర్తించడానికి పిల్లలు తగిన ప్రయత్నం చేయాలి. 70వ సం॥ వచ్చేసరికి వారికి ఏమీ చేతకాదని పిల్లలు భావిస్తుంటారు. కాని, ఆ వయస్సులోనే వృద్ధులలో ఉత్సాహ, ప్రోత్సాహములు, ఆత్మబలము అభివృద్ధి అవుతుంటాయి. అప్పుడే వారి యందున్న ఆత్మశక్తి బయట పడుతుంటుంది. అంతకు పూర్వం వారు సామాన్య మానవులవలె ప్రవర్తిస్తూ సరియైన ఆదర్శాన్ని నిరూపించకపోయినప్పటికీ 70వ సం॥ దాటిన తరువాత వారిలో ఆవిర్భవించే

sri sathyasai vachanamrutam

మనోశక్తులు, దివ్యశక్తులు, సంకల్పశక్తులు నూతనమైన మార్గాన్ని నిరూపిస్తూ వస్తుంటాయి. యువకులయందు లేని శక్తి వృద్ధులయందు ఆవిర్భవిస్తుంటుంది. రిటైరైన తరువాతకూడా సైంటిస్టులకు చాలా విలువ ఇస్తున్నారు కదా! వారియందున్న తెలివితేటలు, నూతనమైన ఆలోచనలు ఎవరియందూ కానరావు. యువకులు సరియైన శిక్షణ పొందాలనుకుంటే, తల్లిదండ్రులను తమదగ్గర పెట్టుకొని వారియందు ఆవిర్భవించే సదాలోచనలను, సద్గుణములను గుర్తించి వర్తించాలి.

**పెద్దలను, వృద్ధులను అలక్ష్యం చేయకండి**

మీ మనోశక్తిని కేంద్రీకరించి పెద్దలు చేసే పనులు ఎలాంటివో విచారిస్తే, మీలో ఎంతో జ్ఞానం అభివృద్ధి అవుతుంది; మీ జీవితంలో ఎంతో మంచి మార్పులు కలుగుతాయి. వృద్ధులను పనికిరానివారని ప్రక్కకి నెట్టివేయకూడదు. వారిని ఆదర్శంగా తీసికొని వారి దారివెంట మనము నడచినప్పుడే సత్యమును గుర్తించడానికి మనకు వీలౌతుంది. భీమునియొక్క భుజబలమును మీరు గొప్పగా వర్ణిస్తారు. కాని, కేవలం భుజబలము మాత్రమే కాదు; అతని బుద్ధిబలము, తెలివితేటలుకూడా చాలా గొప్పవి. అదేవిధముగా, వృద్ధులయందు ఆవిర్భవించే యోచనలు చాలా గొప్పవిగా ఉంటాయి. వారు పిల్లలకందించే ఆదర్శాలు ఎంతో విలువైనవిగా ఉంటాయి. కాని, వాటిని సరిగా అర్థం చేసుకోలేక 'ముసలివాళ్ళు ఏదో చెబుతున్నారని పిల్లలు వాళ్ళ మాటలను అలక్ష్యం చేస్తున్నారు. వాళ్ళ యందు ఆవిర్భవించే యోచనలను పట్టించుకోకుండా ప్రక్కకు నెట్టివేస్తున్నారు. ఆవిధంగా నెట్టివేయకుండా వాటిని గట్టిగా పట్టుకొని అనుసరిస్తూ రండి. వృద్ధులైన వారినుండి ప్రపంచానికి ఎంతైనా శక్తిని అందించడానికి వీలవుతుంది. ఇటువంటి శక్తిని బయట పెట్టించి యువకులకు ఆదర్శాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఈనాడు ప్రాచీన ఋషులయొక్క తత్వాన్ని బయటపెడుతున్నాం. ఈనాటినుండి భీమ రథ శాంతిని మనం అభివృద్ధిపరచాలి. ఇది రాబోయే యుగమునకు చాలా ప్రధానమైనది.

మనం భవిష్యత్తులో ఆనందమును అనుభవించాలంటే పెద్దలను, వృద్ధులను అలక్ష్యం చేయకూడదు. పిల్లల భవిష్యత్తుకొరకు పెద్దలు వేసే ప్లాన్లు చాలా గొప్పవిగా ఉంటాయి.

sri sathyasai vachanamrutam

వాళ్ళలో వచ్చే ప్రతి ఆలోచన ఎంతో విలువైనదిగా ఉంటుంది. అటువంటి పవిత్రమైన ఆలోచనలలో వెయ్యింట ఒక భాగమైనా ఈనాటి యువకులందు కనిపించడం లేదు. వారికి ఒక్కపూట భోజనం పెట్టలేనంత బలహీనులైపోతున్నారు. వారికి ఒక్కపూట భోజనం పెడితే అంతకు పదింతల విలువను వారు మనలో పెంచుతారు. పిల్లలను అభివృద్ధికి తీసుకురావడంలో పెద్దలకున్న ఉత్సాహం ఎవ్వరియందూ కానరాదు. పూర్వం రాజులు ప్రతి విషయంలోనూ మహర్షులను సంప్రదించి, వారి సూచనలను, సలహాలను పాటించేవారు. ఈనాటికీ వారు వ్రాసిన గ్రంథాలను ప్రజలు పరిశీలిస్తున్నారు. కాని, అందులో వేయింట ఒక వంతైనా అర్థం చేసుకోలేకపోతున్నారు. 'ఆత్మ, ఆత్మ, ఆత్మ...' అని అంటున్నారేగాని, ఆత్మతత్త్వాన్నిగురించి తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మతత్త్వము ఎక్కడున్నది? ఆత్మ అమృతమయమైనది; రూపనామములకు అతీతమైనది. 'ఈ శరీరము నాది' అని నీవు భావిస్తున్నావు. దీనిని నీవు ధరించినావు కనుక, 'ఇది నాది' అంటున్నావు. కాని, నీవు దేహము కాదు; మనస్సు కాదు; బుద్ధి కాదు; చిత్తము కాదు; అంతఃకరణము కాదు. వీటన్నిటికీ అతీతమైన ఆత్మస్వరూపుడవు నీవు. సర్వశక్తులయొక్క మూలాధారమైన శక్తియే ఆత్మ. మల్లెపూల పొదదగ్గర నిలబడితే దానినుండి ఎంతయో సుగంధము వస్తుంది. ఆ సుగంధము మల్లెపూలనుండి వచ్చిందా? కాదు, కాదు. దైవశక్తియే దానికి ఆధారము. ఇలాంటివి ఎన్నియో మానవునికి అర్థం కాకుండా మరుగునపడి ఉన్నాయి. ముఖ్యంగా, మానవుడు దైవత్వంపట్ల తన విశ్వాసాన్ని దృఢం చేసుకోవాలి.

**మానవత్వమునుండి దివ్యత్వానికి...**

మహాభారతంలో ద్రుపదరాజ పుత్రియైన ద్రౌపది దృఢమైన ఆత్మశక్తికి ప్రతీకగా నిలిచింది. అశ్వత్థామ నిద్రిస్తున్న ఉపపాండవుల గొంతులు కోసినప్పుడు అర్జునుడు అతనిని పట్టి బంధించి శిరచ్ఛేదము చేయడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు ద్రౌపది, "అర్జునా! నా కుమారులను కోల్పోయినందుకు నేను ఎంతగా దుఃఖిస్తున్నానో ఇప్పుడు నీవు అశ్వత్థామను సంహరిస్తే అతని తల్లికూడా అంతగా దుఃఖిస్తుంది కదా! కాబట్టి, నీవితనిని చంపవలదు', అని ప్రార్థించింది.

sri sathyasai vachanamrutam

**వెఱచినవాని, దైన్యమున వేదుఱు నొందినవాని, నిద్ర మై**
**మఱచినవాని, సౌఖ్యమున మద్యము ద్రావినవాని, భగ్నుడై**
**పఱచినవాని, సాధు జడభావమువానిని, గావుమంచు వా**
**చఱచినవాని, గామినుల జంపుట ధర్మము గాదు ఫల్గునా!**

అన్నది. "అర్జునా! ఆడవారి మాటలు విని అశ్వత్థామను వదలిపెడతావా?" అని భీముడు మండిపడ్డాడు. అప్పుడు అర్జునుడు, "ద్రౌపదీ! నేను అశ్వత్థామను చంపుతానని ప్రతిజ్ఞ చేశాను కదా!" అని పలుకగా, "నీవతని శిరోమణిని పుచ్చుకొని, తలగొరిగి బయటికి నెట్టివేస్తే అతని ప్రాణం తీసినట్లే,' అని చెప్పింది. ఆమె సలహాను అనుసరించి అర్జునుడు అశ్వత్థామను పరాభవించి వదలిపెట్టాడు.

**విశ్వస్తుత్యుడు, శక్రసూనుడు, మహావీరుండు ఘోరాసిచే**
**నశ్వత్థామ శిరోజముల్ దఱిగి; చూడాంతర్మహారత్నమున్**
**శశ్వత్కీర్తి వెలుంగ బుచ్చుకొని, పాశవ్రాతబంధంబులన్**
**విశ్వాసంబున నూడ్చి, త్రోచె శిబిరోర్వీభాగముం బాసిపోన్**

ఒకానొక సమయంలో ద్రౌపది ఒంటరిగా ఒక నది ఒడ్డున కూర్చొని ఉంది. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవులు ఎవ్వరూ అక్కడ లేరు. ఆ సమయంలో ఆమె తన శిరస్సునుండి ఒక వెంట్రుక తీసి అనేక మంత్రములు చెప్పి నీటిలో వదిలింది. ఆ ఒక్క వెంట్రుక చుట్టూ ఉన్న కొండలనన్నింటినీ బంధించిపెట్టింది. ఈ సంఘటననుగురించి తరువాత అనేకమంది యోగులు ఎంతో విచారణ సల్పారు. అది ద్రౌపది కురుల యొక్క శక్తి అని గుర్తించారు. ప్రాచీన ఋషులు వెంట్రుకలను కత్తిరించుకునేవారు కాదు. వారి దేహమునుండి పుట్టిన వెంట్రుకలు పవిత్రమైనవి, మహాశక్తిమంతమైనవి. ఇలాంటి తత్త్వమును ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. ఇటువంటి అనేక శక్తిసామర్థ్యములు కలిగిన మానవుడీనాడు తన నిజతత్త్వమును తాను గుర్తించుకోలేకపోతున్నాడు. మానవత్వమునందు పుట్టినవాడు మానవత్వాన్నే మరచిపోయి దానవత్వాన్ని పెంచుకుంటున్నాడు. మానవుడనగా మానవత్వాన్ని వికసింపజేసే గుణము కలిగినవాడు.

sri sathyasai vachanamrutam

గుణవంతమైన చర్యలద్వారా మానవత్వాన్ని పోషించుకుంటూ రావాలి. దానవత్వాన్ని త్యజించాలి. దివ్యత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. 'యూనిటీ', 'ప్యూరిటీ', 'డివినిటీ' (ఏకత్వము, పవిత్రత, దివ్యత్వము) – ఈ మూడింటినీ అభివృద్ధిపరచుకోవాలి. 'యూనిటీ' అనగా మానవ ఏకత్వము. అందులోనే 'డివినిటీ' ప్రతిబింబిస్తుంది.

**అవతార పురుషుల శరీరమునుండి దివ్యశక్తి అనేకవిధాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది**

నేనొక పర్యాయము గోవాకు వెళ్ళినప్పుడు గవర్నర్ నకుల్‌సేన్ ఇంట్లో బస చేశాను. అతని భార్య పేరు ఇందు. నేను ముందు హాలులో పడుకున్నాను. వాళ్ళిరువురూ బెడ్‌రూమ్‌లో పడుకున్నారు. ఆరోజు రాత్రి ఒక అద్భుతం జరిగింది. నేను పడుకున్నప్పుడు నా నాభినుండి ఒక గొప్ప తేజస్సు బయలుదేరింది. ఈ దృశ్యాన్ని ఆమె కిటికీలోనుండి చూసింది. అంత పెద్ద తేజస్సును చూసి ఆమె ఆశ్చర్యచకితురాలై, "ఏమండీ, లేవండి", అంటూ తన భర్తను నిద్ర లేపింది. "నీకు బుద్ధి లేదు, పడుకో", అన్నాడు నకుల్‌సేన్. "మీరే బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారు. ఒక్కసారి కళ్ళు తెరచి స్వామి నాభినుండి వస్తున్న దివ్యతేజస్సును చూడండి", అని ఆమె గట్టిగా చెప్పడంతో ఆయన లేచి చూశాడు. నా నాభినుండి వస్తున్న దివ్యతేజస్సును చూసి చాలా ఆశ్చర్యపడ్డాడు.

ఈ అవతారంయొక్క బాల్యదశలో జరిగిన మరో సంఘటనను చెబుతున్నాను. కరణం సుబ్బమ్మ స్వామిపట్ల ఎంతో భక్తిగా ఉండేది. ఆమె భక్తి ఇంతా, అంతా అని వర్ణించడానికి వీలుకాదు. ఆనాటి పరిస్థితుల్లో బ్రాహ్మణులు హరిజనుల ఇళ్ళకు వెళ్ళేవారు కాదు. ఒకనాడు నేను, "సుబ్బమ్మా! నేను హరిజనవాడకు వెళుతున్నాను", అని చెప్పాను. "అయ్యో, స్వామీ! అక్కడికెందుకు వెళుతున్నారు?" అని అడిగింది. "ఎందుకు పోకూడదు? ఎందుకు వారు వండిన అన్నము తినకూడదు? నేను వెళుతున్నాను", అని చెప్పి బయలుదేరాను. ఆమెకూడా నా వెనుకనే వచ్చింది. మేము వెళ్ళిన ఇంటివారు చాలా బీదవారు పాపం! వాళ్ళింట్లో కూర్చోవడానికి కుర్చీలు లేవు. ఒక పాత పంచె తెచ్చి క్రింద పరచి దానిపై నన్ను కూర్చోమన్నారు. భోజనాలైన తరువాత నేను అక్కడే విశ్రమించాను. కొంతసేపటికి నా నాభినుండి మిద్దె ఎగిరిపోయేటట్లు ఒక పెద్ద శబ్దము వచ్చింది. ఆ శబ్దం విని ఇంటివారు

sri sathyasai vachanamrutam

హడలిపోయి బయటికి పరుగెత్తారు. ఈవిధంగా, అవతారపురుషుల శరీరమునుండి దివ్యశక్తి అనేకవిధాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది.

**ప్రతి వ్యక్తియందు దివ్యశక్తి ఉంటున్నది**

స్వామి కురులయొక్క శక్తి చాలా అతీతమైనది. దీనిని ఎవ్వరూ అర్థము చేసుకోలేరు. నేను దువ్వుకోవడం లేదు కాబట్టి, అవి అణిగి ఉంటున్నాయి. అసలు నేను దువ్వుకోవడానికి దువ్వెన లేదు. పూర్వం నేను ఆఫ్రికాకు వెళ్ళినప్పుడు అక్కడి భక్తులు నాకొరకు ఇనుముతో చేసిన బ్రష్ ఒకటి తెచ్చి ఇచ్చారు. నేను కురులపై పెడితే ఆ బ్రష్ బయటికి రాలేదు. ఇంత దృఢమైన వెంట్రుకలు ఉంటున్నాయి నాకు. బలంగా లాగినా అవి బయటికి రావు. ఇది మహనీయులయొక్క కురుల తత్త్వము. మీరు చక్కగా విచారణ చేసి, పరిశోధన చేసి, పరిశీలన చేసినప్పుడే వీటి శక్తి సామర్థ్యములు చక్కగా అర్థమౌతాయి. ప్రతి వ్యక్తియందు దివ్యశక్తి ఉంటున్నది. ఆ శక్తిని కాపాడుకోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా, శిరస్సు చాలా పవిత్ర మైనది. శిరస్సునుండియే సర్వశక్తులూ ఆవిర్భవిస్తున్నాయి. కాబట్టి, శిరస్సును బాగా కాపాడుకోవాలి. ఈనాటి యువకులు తమలో ఉన్న శక్తిని వ్యర్థం చేసుకుంటున్నారు. అందుచేతనే, వారికి తొందరగా ముసలితనం సంప్రాప్తమవుతున్నది. ఈ దేహానికి 80వ సం॥ వస్తున్నది. కాని, నేను ఎనభై ఏళ్ళ వ్యక్తిమాదిరి కనిపిస్తున్నానని ఎవరైనా చెప్పగలరా? ఎవ్వరూ చెప్పలేరు. నేను గట్టిగా పిడికిలి బిగిస్తే పదిమంది వచ్చి ప్రయత్నించినప్పటికీ దానిని సడలించలేరు. ఇటువంటి దివ్యశక్తి ప్రతి వ్యక్తియందు ఉంటున్నది. కాని, మీరు దానిని దుర్వినియోగం చేసుకుంటున్నారు. దైవశక్తి ఇట్టిది, అట్టిది అని వర్ణించడానికి వీలుకాదు. దానిని అనుసరించండి. అనుసరించి ఆనందాన్ని అనుభవించండి. ఆవిధంగా చేసినప్పుడు మీకు ఎంతైనా శక్తి కలుగుతుంది. మానవత్వమునందున్న దివ్యశక్తి ఎంతో గొప్పది. మీరు పాడే పాటలను, మాట్లాడే మాటలను, చేసే పనులను అన్నింటినీ దైవార్పితం గావించి మీ జన్మను ధన్యం చేసుకోండి.

– శ్రీవారి దివ్యబోధ, తేదీ 10.02.2005
భీమరథ శాంతి మహోత్సవము

sri sathyasai vachanamrutam